క్లుప్తంగా

ఏపీ ఎన్జీఓ సంఘ మహాసభలకు ఆహ్వానం



నెల్లూరు(దర్గామిట్ట): విజయవాడలో ఈ నెల 21, 22న నిర్వహించనున్న ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. మహాసభలకు మంత్రిని ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఆహ్వానించారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాల ప్రదర్శన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్ర్య సమరయోధుల వర్ణచిత్ర ప్రదర్శనను ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరరావు ప్రారంభించారు. 350 మంది స్వాతంత్ర్య సమరయోధుల వర్ణచిత్రాలను ప్రదర్శించడాన్ని అభినందించారు. ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి రషీద్, చిత్రకారులు నజీర్ అహ్మద్, గౌస్, ఖాజారసూల్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభహాన్, రఫీ, రియాజ్, నజీర్‌బాషా, ఫయాజ్ పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న టెంపో

వెంకటాచలం: టిప్పర్‌ను టెంపో ఢీకొని బోల్తాపడి నలుగురు తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలిలోని స్టేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్న తొమ్మిది మంది ఉద్యోగులు తిరుపతిలో శిక్షణ కోసం టెంపోలో వెళ్లారు. తిరిగి కావలికి వెళ్తుండగా వెంకటాచలం సమీపంలో జాతీయ రహదారిపై టిప్పర్‌ను టెంపో ఢీకొనడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు ఉద్యోగులకు తీవ్ర గాయాలవగా, మరో ఐదుగురికి, టెంపో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంటనే హైవే అంబులెన్స్‌లో నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షూటింగ్‌బాల్ జూనియర్స్ జట్ల ఎంపిక నేడు

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరులోని పాటూరు ఉన్నత పాఠశాలలో సోమవారం షూటింగ్ బాల్ జిల్లా జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య తెలిపారు. ఆదివారం ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు జనవరి 1వ తేదీ 2004 సంవత్సరం తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఎంపికలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరుగుతాయన్నారు. ఆయా జట్లు ఈ నెల 12, 13 తేదీల్లో బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే అంతర్‌జిల్లాల షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. వివరాలకు 949032 0435, 79890 49566 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిందితుడిపై చర్యలకు డిమాండ్

ఇందుకూరుపేట: దాడిలో గాయపడి ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యాటగిరి రమణమ్మను కిడ్నాప్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆస్పత్రి వద్ద విలేకరులతో మాట్లాడారు. గిరిజన మహిళపై దారుణంగా దాడిచేసి, గదిలో బంధించి, కులంపేరుతో దూషించిన టీడీపీ నేత గంపల అనిల్‌పై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ఏందోటి సురేంద్ర, ఏలూరు బుజ్జయ్య పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈ కేవైసీ గడువు పొడిగింపు

కొడవలూరు: పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులు ఈ కేవైసీ చేయించుకునేందుకు ఈ నెలాఖరు వరకు గడువును పొడిగించారని ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 89 శాతం మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని వివరించారు. గడువు పొడిగించిన నేపథ్యంలో మిగిలిన రైతులు ఈ కేవైసీని చేయించుకోవాలని సూచించారు.

అవసరమైన వారికి హృద్రోగ పరీక్షలు

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్
- రాజన్న గుండె భరోసాను సద్వినియోగం చేసుకోండి



సూచనలు చేస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాజన్న గుండె భరోసా కార్యక్రమం ద్వారా అవసరమైన వారు హృద్రోగ పరీక్షలను చేయించుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ కోరారు. నగరంలోని 44, 46వ డివిజన్ల ప్రజల కోసం ఎనెల్ హాస్పిటల్ సహకారంతో సొంతంగా ఏర్పాటు చేసిన రాజన్న గుండె భరోసా కార్యక్రమాన్ని బారకాస్ సెంటర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ప్రతి ఒక్కరికీ రక్త, ఈసీజీ, ఎకో, తదితర పరీక్షలు చేసి.. అవసరమైన వారికి ఆపరేషన్లను చేయించనున్నామని వివరించారు. ఇప్పటి వరకు ఐదు వేల మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి.. 200 మందికి ఆపరేషన్లను చేయించామని తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 241 మందికి వైద్య పరీక్షలను డాక్టర్ నాగేంద్రప్రసాద్ నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు నీలి రాఘవ, వేలూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): నరుకూరు రోడ్డులోని మద్దులూరు వీర రాఘవయ్య కల్యాణ మండపంలో నెల్లూరు జిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు రూ.రెండు వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఇద్దరు విద్యార్థులకు రూ.3500 చొప్పున రవికుమార్, విజయలక్ష్మి దంపతులు పంపిణీ చేశారు. వేలూరు రంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త దువ్వూరు కిషోర్‌బాబు, దీపిక బాబా, విశ్రాంత జేసీ ఒంగోలు శేషయ్య, జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ కూరపాటి పెంచలసుధాకర్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అమరావతి, పొట్లూరి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మందుల అందజేత



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకం ద్వారా పేదలకు మందులను ఆదివారం అందజేశారు. బాలాజీనగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమానికి చేయూతనందించిన దాత, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు. ప్రతి నెలా రూ.50 వేల విలువైన మందులను అందజేస్తున్నామని వివరించారు.

సమస్యల పరిష్కారానికే పోరు యాత్ర



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమస్యల పరిష్కారానికే ప్రజా పోరు యాత్రను చేపడుతున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్‌కాలనీలో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వెంకటేశ్వరపురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, నరసింహ, పద్మ, మూలం ప్రసాద్, శేషయ్య, జాఫర్, సంపూర్ణమ్మ, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బీసీల డిమాండ్లను నెరవేర్చాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీసీల డిమాండ్లను ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో నెరవేర్చాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య కోరారు. వేదాయపాళెంలోని బీసీ సంక్షేమ సంఘ స్టూడెంట్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, ప్రత్యేక అట్రాసిటీ చట్టం, తదితరాల అమల్లో గత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు సింహాచలం యాదవ్, నేతలు పైడిరాజు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలో గుంటూరు విజయవంతానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యానాదుల సమస్యలను పరిష్కరించాలంటూ సెప్టెంబర్ తొమ్మిదిన నిర్వహించతలపెట్టిన చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యానాదుల పొలిటికల్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గుంటూరులో నిర్వహించనున్న సభలో రాజకీయ నిర్ణయాన్ని తీసుకుంటామని చెప్పారు. నేతలు కృష్ణయ్య, రమేష్, సతీష్, ఉషా, రమ్య, కోటేశ్వరరావు, మల్లిక, ప్రభావతి, మురళి, శ్రీనివాసులు, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సహస్రదీపాలంకరణ సేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో సహస్రదీపాలంకరణ, ఊంజల్‌సేవను భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

ఆరోపణలు సిగ్గుచేటు

నెల్లూరు(మినీబైపాస్): ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నిజాముద్దీన్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. దర్గాలో జరిగిన చిన్న పొరపాట్లను వేలెత్తి చూపడం తగదని సయ్యద్ సమీకి సూచించారు. టీడీపీకి తొత్తుగా వ్యవహరిస్తూ తమ పార్టీపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలు తన వెనుకే ఉన్నారని, తాను చెప్పేతే ఓట్లు వేస్తారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత, వాత్సల్య చిన్నారులు, వృద్ధాశ్రమంలో 85 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను శ్రీనివాసన్, హనుమాయమ్మ దంపతులు ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. ఏపీ జీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, జనహిత, వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, కోదండరామయ్య, రమణయ్య, గిరి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(మినీబైపాస్): ముస్లింల సమస్యలను పరిష్కరించాలని ముస్లిం ఐక్యవేదిక నేతలు కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఐక్యవేదిక స్టేట్ ప్రెసిడెంట్ జాఫర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేయడం తగదు



మాట్లాడుతున్న నవకోటేశ్వరరావు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయులను వేధించేలా రాష్ట్ర విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ చేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ నెల 12న ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా విజయవంతం, తదితర అంశాలపై చర్చించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు విజయకుమారి, కోశాధికారి మురళీధర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులు నాగిరెడ్డి, తిరుపతయ్య, ఖాజావలీ, నారాయణ, రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): పట్నా ఎక్స్‌ప్రెస్ కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేదాయపాళెం - నెల్లూరు రైల్వేస్టేషన్ మధ్యలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 65 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు కలిగి.. తెలుపు రంగుపై గ్రే రంగు నిలువు గీతల హాఫ్ హ్యాండ్స్ చొక్కా, బ్రౌన్ రంగుపై తెలుపు రంగు చెక్స్ లుంగీని ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

ఆర్టిజన్ కార్డులతో ఎంతో ఉపయోగం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్టిజన్ కార్డులతో ఎంతో ఉపయోగమని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకట శేషయ్య ఆచారి పేర్కొన్నారు. నగరంలోని విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో కార్డులను ఆదివారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. చేతివృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రమాద బీమా, ఉపాధి అవకాశాలు, సబ్సిడీ పథకాలను పొందేందుకు కార్డులు తప్పక ఉండాలని చెప్పారు. మొత్తం 250 మందికి కార్డులను అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు సదాశివ ఆచారి, బాబు, ప్రసాద్, మదన్‌మోహన్, నిరంజన్, వరప్రసాద్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు రూరల్: నారాయణరెడ్డిపేటలోని బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని ఆదివారం నిర్వహించారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మామ సుబ్బారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేపట్టారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన గాండ్ల సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. నగరంలోని మహేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో 16 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు పంపిణీ చేశారు. ప్రభాకర్‌రావు, హరగోపాల్, శేషయ్య, గుర్నాథం, ధనుంజయ, సురేష్‌బాబు, శ్రీనివాస్, రమేష్‌బాబు, చంద్రబాబు, ఆదిశంకర కళాశాల ప్రిన్సిపల్ వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 80 వేల మందికిపైగా ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, వీరికి గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, వేతనంతో పాటు సరైన పనివేళలను కల్పించాలని కోరారు. హక్కులను సాధించుకునేందుకు సంఘటితంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అసోసియేషన్ చీఫ్ కో ఆర్డినేటర్ ఈశ్వరయ్య మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం గుంటూరులో కార్యక్రమాన్ని వచ్చే నెల 17న నిర్వహించనున్నామని వెల్లడించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా లీలామోహన్‌తో పాటు 15 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ నేత సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, యూనియన్ రాష్ట్ర నేతలు ప్రత్యూష, సుబ్బారావు, రామనాథం, అనిల్‌కుమార్, చెన్నకేశవులు, శ్రీనివాసరావు, గౌరీశంకర్, కోదండరామిరెడ్డి, ధన్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత, నృత్య పోటీలు



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో సంగీత, నృత్య పోటీలను ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేతా సుబ్బారావు పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప, నజీర్‌బాషా, సంఘసేవకుడు అంజద్‌బాషా, తదితరులను సత్కరించారు. వర్ధమాన కళాకారులు.. సంగీత, నృత్య పోటీల్లో పాల్గొన్న బాలలకు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాయకులు లక్ష్మి, మధుసూదన్, షఫీ, రామచంద్రరావు, తదితరులు ఆలపించిన గీతాలు అలరించాయి. మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): గుండె సమస్యతో బాధపడుతున్న బీవీనగర్‌కు చెందిన సుభాషిణికి ఆర్థిక సాయాన్ని అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రమేష్‌బాబు మాట్లాడారు. బాధితురాలికి తమ ఫౌండేషన్ ద్వారా ప్రతి నెలా రూ.రెండు వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేస్తున్నామని వివరించారు. వంశీరెడ్డి, శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బట్వాడిపాళెంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. వసతిగృహ విద్యార్థినుల సౌకర్యార్థం రూ.30 వేల విలువైన సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. తన స్నేహితుల సహకారంలో హాస్టల్లో పలు సమస్యలను పరిష్కరించామని తెలిపారు.

13న యాదే రఫీ



నెల్లూరు(మినీబైపాస్): పద్మశ్రీ మహమ్మద్ రఫీ 43వ వర్ధంతిని పురస్కరించుకొని యాదే రఫీ కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహించనున్నామని రఫీ కల్చరల్ అకాడమీ ప్రెసిడెంట్ జావీద్ అహ్మద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా టౌన్‌హాల్లో మ్యూజికల్ నైట్‌ను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.